# బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నేతలు

- పార్టీలోకి ఆహ్వానించిన సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం



సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రాంభూపాల్‌రెడ్డి, లోకారెడ్డి

పెంట్లవెల్లి, అక్టోబర్ 31 : కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌లోకి స్వచ్ఛందంగా చేరుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు రాంభూపాల్ రెడ్డి, లోకారెడ్డి(మాజీ జెడ్పీటీసీ) మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 70 ఏండ్లలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ పదేండ్లలో కని విని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారని కొనియాడారు. కొల్లాపూర్‌లో 19 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న జూపల్లి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా బీరం గెలిచిన అనతి కాలంలోనే కొల్లాపూర్ నియోజకవర్గానికి సాగునీరు అందించడంతోపాటు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధికి పరితపించే నాయకుడు బీరం అని, ఆయనను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో గోప్లాపురం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# దేశ సమగ్రతకు ప్రతిపౌరుడూ పాటుపడాలి

- కలెక్టర్ తేజస్‌నంద లాల్ పవార్
- ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి
- జాతీయ సమైక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ



జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

వనపర్తి, అక్టోబర్ 31 : దేశంలోని ప్రతి పౌరుడు దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం కోసం పాటుపడేందుకు ప్రతిజ్ఞ బునాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత ప్రతిజ్ఞను కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అంతర్గత ప్రాంతాలన్నింటిని విలీనం చేసి ఆఖండ భారతవనిని ఏర్పాటు చేయడంలో పటేల్ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. దీనికి గానూ దేశం ఆయన సేవలను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దేశంలోని ఏక్తా, శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వంతో రాజ్యాంగం అమలులోకి వచ్చి రాష్ట్రాల్లో జిల్లాలో రాజ్యాంగపరమైన పాలన కొనసాగుతుందన్నారు. దేశంలో ప్రతి పౌరుడు ఐకమత్యంతో చట్టాలను గౌరవిస్తూ దేశ సమగ్రత, సమైక్యత కోసం పాటుపడాలన్నారు. అలాగే ప్రజాస్వామ్యంలో నిష్పాక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి పౌరుడు,అధికారి నిస్వార్థంగా కృషిచేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని కోరారు. అంతకుముందు జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాడు అధ్వానం



## నేడు అద్భుతం



### అప్పుడెట్లుండే..

సమైక్య రాష్ట్రంలో వనపర్తి జిల్లా కేంద్రంలో గాంధీ చౌక్, పాతబజార్, ఖిల్లా ఘణపురం రోడ్డులో ప్రయాణమైతే నరకయాతనే. అడుగడుగునా గుంతలు.. తారులేచిన రహదారులు.. ఇరుకుగా ఉండే సింగిల్ రోడ్లతో ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. వాన కురిస్తే చాలు రోడ్లన్నీ జలమయమయ్యేవి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునేవి.. జిల్లా కేంద్రం నుంచి పట్నం పోవాలన్నా, జిల్లా కేంద్రంలో రాకపోకలు సాగించాలన్నా ట్రాఫిక్ సమస్యతో సమయం పట్టేది. ఆపత్కాలంలో త్వరగా దవాఖానకు పోవడానికి సౌలత్ ఉండేది కాదు. ఇక అగ్నిప్రమాదాలు జరిగిన చోటుకు సకాలంలో ఫైరింజన్ రాలేక జరిగిన నష్టం అంతా ఇంతా కాదు.



### ఇప్పుడెట్లున్నది..

ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత వనపర్తి ప్రజల చిరకాల వాంఛ రోడ్ల విస్తీర్ణ పనులను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేపట్టడంతో జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ ప్రధాన రోడ్లు తళతళా మెరుస్తూ రెండు లేన్లుగా మారాయి. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, ఆహ్లాదం కలిగించే మొక్కలతో కనిపిస్తున్నాయి. ఏ రూట్లో చూసినా ప్రయాణ సమయం బాగా తగ్గింది. జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ అద్దాల్లా మారడంతో సులువుగా.. సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు విస్తీర్ణం పెంచి అద్భుతంగా తీర్చిదిద్దారు..

-వనపర్తి ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ



సీఎం సభావేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# 6న మక్తల్‌కు సీఎం కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధిని గెలిపించాలి
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్‌టౌన్, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 6వ తేదీన మక్తల్‌కు సీఎం కేసీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రజా ఆశీర్వాద సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తేదీన తెలంగాణ అభివృద్ధి ప్రదాత, సీఎం కేసీఆర్ మక్తల్ సభకు హాజరవుతున్నారన్నారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రతి అంశాన్ని అమలుచేస్తామన్నారు. అర్హులైన వారికి రూ.400కే సిలిండర్, మహిళకు నెలకు రూ.3 వేల భృతి అందజేస్తామన్నారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా'తో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిచనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్రంలో గడపగడపకూ సీఎం కేసీఆర్ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నజర్

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి
- వనపర్తి ఎస్పీ రక్షితా మూర్తి
- గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లో కేంద్రాల పరిశీలన



గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రక్షితా మూర్తి

గోపాల్‌పేట, అక్టోబర్ 31 : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఎస్పీ రక్షితా మూర్తి పేర్కొన్నారు. గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఉమ్మడి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కనీస మౌలిక వసతులు ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు. తాడిపర్తి ప్రాథమిక పాఠశాల, గోపాల్‌పేట ఉన్నత పాఠశాల, బుద్దారం ప్రాథమిక, ఉన్నత పాఠశాల, పొల్కెపహాడ్ మండల పరిషత్ పాఠశాల, ఏదుట్ల ఉన్నత పాఠశాల, రేవల్లి మండలంలోని చెన్నారం ప్రాథమికోన్నత పాఠశాల, రేవల్లి ఉన్నత పాఠశాల, బండరావిపాకుల ప్రాథమికోన్నత పాఠశాల, నాగపూర్ జెడ్పీఉన్నత పాఠశాల, ఏదుల మండలకేంద్రంలోని ప్రాథమిక, జెడ్పీఉ న్నత పాఠశాలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఎస్పీ పరిశీలించారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపులు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చూసిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడైనా ఏవైనా సౌకర్యాలు లేకుంటే తక్షణ మే ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను సంద ర్శించేటప్పుడు ఆమె పాఠశాలల విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ మహేశ్వర్‌రావు, తాసీల్దార్ శ్రీనివాసులు, గోపాల్‌పేట ఎస్సై వెంక టేశ్వర్లు, రేవల్లి ఎస్సై శివకుమార్ తదితరులు ఉన్నారు.